


# నవభూమి

## జిల్లా అనుబంధం

27 అక్టోబర్,2024 ఆదివారం పేజీలు:9

www.epaper.navabhoomi.in


## టీజీఎస్పీ హఠావో..

# ఏక్ పోలీస్ బచావో

**❑ రోడ్డెక్కిన 6వ బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబాలు**








**కొత్తగూడెం అక్టోబర్ 26 నవభూమి ప్రతినిధి:** 6వ బెటాలియన్ కానిస్టేబుళ్లుగా పని చేస్తున్న భర్తల కోసం భార్యలు, కుటుంబ సభ్యులురోడ్డెక్కారు. లక్ష్మీదేవిపల్లి పాల కేంద్రం నుంచి సూపర్ బజార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, ప్రభుత్వం వన్ పోలీస్, వన్ రూల్ ను అమలు చేయాలని, పోలీస్ డ్యూటీలో తమ భర్తలను వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆరోపించారు. తమిళనాడు, కర్ణాటక పోలీసు విధానాన్ని అనుసరించాలని డిమాండ్ చేశారు. టీజీఎస్పీ హఠావో.. ఏక్ పోలీస్ బచావో అంటూ నినాదాలు చేశారు. పొరుగు రాష్ట్రాల్లోని పోలీస్ విధానాలను తెలంగాణలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ భర్తలు 8 గంటలకు మించి బెటాలియన్ కానిస్టేబుళ్లకు డ్యూటీ వేస్తుండటాన్ని నిరసిస్తూ ధర్నాకు దిగారు. నెలలో నాలుగు రోజులు మాత్రమే సెలవు ఇస్తే ఎలా అంటూ ప్రశ్నించారు. తమ భర్తలతో కూలీ పనులు, చెత్త ఏరే పనులు, మట్టి పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. కానిస్టేబుళ్లతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని వాపోయారు. తరచూ పోస్టింగులు మారుస్తూ ఉండటంతో పిల్లల చదువులకు ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. తమ సమస్యలు పరిష్కారించాలని కోరారు. కొత్తగూడెం ప్రధాన జాతీయ రహదారిపై కానిస్టేబుళ్ల భార్యలు, కుటుంబ సభ్యులు ధర్నా చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. బెటాలియన్ పోలీసులకు ఐదేళ్ల పాటు ఒకే దగ్గర పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. పోలీస్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న తమ భర్తలు ఇంటికి దూరంగా ఉంటున్నారని, నెలలో నాలుగు రోజులు మాత్రమే ఇంట్లో ఉంటున్నారని వాపోయారు. ఉద్యోగాల పేరుతో తమకు దూరం చేస్తున్నారని, ఇకనైనా ఒక రాష్ట్రం, ఒకే పోలీస్ విధానం అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు.

## కొత్తగూడెం కార్పొరేషన్ కోసం ప్రయత్నం

# కుడా ఏర్పాటు చేస్తూ జీఓ

**❑ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**కొత్తగూడెం అక్టోబర్ 26 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడ) ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, అధికారులకు పలుమార్లు రిప్రజెంటేషన్లు అందించామని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కొత్తగూడెం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) ఏర్పాటు కోసం జీవో 177 జారీ చేసిందని ఎమ్మెల్యే కూనం నేని సాంబశివరావు వెల్లడించారు. కార్పొరేషన్ ఏర్పాటు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కుడ ఏర్పాటు అయితే నియోజకవర్గ అభివృద్ధి వేగవంతం అవుతుందని, కేంద్ర ప్రభుత్వం నుంచి గుర్తింపు ఉంటుంది, పరిశ్రమలు వస్తాయి, నిధులు పెద్ద మొత్తంలో వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలను కలిపి కార్పొరేషన్ ఏర్పాటు, జెఎన్టియులాగా కేఎస్ఎంను అటానమస్ యూనివర్సిటీ చెయాలని కోరారు. 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు. టూరిజం అభివృద్ధి జూ పార్క్ వెయ్యి ఎకరాల్లో ఏర్పాటు కోసం, విమానాశ్రయం ఏర్పాటు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో ఆర్ ఓ ప్లాంట్ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించాలని, కొత్తగూడెం - పాల్వంచ బైపాస్ రోడ్డు కోసం కోటి రూపాయలు మంజూరు అయ్యాయని వివరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, దుర్గరాసి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, పూర్ణచందర్ రావు, కంచర్ల జమలయ్య, ఏ సాయిబాబా, భూక్యా శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, ధర్మరాజు, యూసుఫ్, బోయిన విజయకుమార్, పీ సత్యనారాయణాచారి, కోటం రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం-నవభూమి:** పోలీస్ అమరవీరుల వారోత్సవాల (ఫ్లాగ్ డే) సందర్భంగా సీటి ఆర్మడ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని రక్తదానం శిభిరాన్ని ఏర్పాటు చేశారు .కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని అన్నారు.



## కొత్తగూడెంలో రాష్ట్ర స్థాయి

# కబడ్డీ పోటీలు

**❑ విజయవంతం చేసేందుకు అందరు సహకరించాలి**

**❑ ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, జారే ఆదినారాయణ**

**కొత్తగూడెం అక్టోబర్ 26 నవభూమి ప్రతినిధి:** రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినం సందర్భంగా కొత్తగూడెంలో ఈ నెల 28 నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను జయప్రదం చేసేందుకు అందరు సహకరించాలని ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, జారే ఆదినారాయణ పిలుపు నిచ్చారు. శనివారం కొత్తగూడెం విద్యానగర్ కాలనీలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, జారే ఆదినారాయణ అన్నారు. దేశంలో సంప్రదాయ క్రీడల్లో కబడ్డీకి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడిగా క్రీడాకారులకు ప్రోత్సాహం అందించి వారిలో కబడ్డీ క్రీడ నైపుణ్యాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని అందులో భాగంగా మంత్రి పొంగులేటి జన్మదినం సందర్భంగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన జట్లతో కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో పిఎస్ఆర్ ట్రస్ట్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. కోరం కనకయ్య మాట్లాడుతు అక్టోబర్ 28 నాడు ఓల్డ్ బస్ డిపో నుండి కళాకారులు, క్రీడాకారులతో ర్యాలీ నిర్వహించి పోటీలు ప్రారంభిస్తామని, ప్రతి రోజు కబడ్డీ మ్యాచ్ లు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఫ్లడ్ లైట్లు వెలుగులో ప్రో కబడ్డీ పోటీల స్థాయిలో జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాలకు చెందిన 10 మెన్, 6 ఉమెన్ ఇన్విటేషన్ టీం లు పాల్గొంటాయని, ప్రో కబడ్డీ మాదిరిగా పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జాతీయ స్థాయిలో నైపుణ్యత కలిగినటువంటి రిఫరీలతో క్రీడలను నిర్వహిస్తామని, ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ముఖ్యంగా జిల్లా కేంద్రం కొత్తగూడెంలో కబడ్డీ ఫీవర్ మొదలైందని మీడియా రాష్ట్ర పోటీలకు గురించి విస్తృత జిల్లా ఖ్యాతిని పెంచేందుకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ చీకటి కార్తీక్, జనరల్ సెక్రటరీ స్వాతిముత్యం, మాజీ జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నాగేంద్ర త్రివేది, తూము చౌదరి, నాయకులు పెదబాబు, జెవిఎస్ చౌదరి, కౌన్సిలర్లు వై శ్రీనివాస్ రెడ్డి, తలుగు అనిల్, నాయకులు రాయల శాంతయ్య, మైనారిటీ నాయకులు మహమ్మద్ గౌస్, అయూబ్ ఖాన్, జానీ భాయ్, మహిళా నాయకురాళ్లు హైమావతి, వాణిరెడ్డి, రమాదేవి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ మండల అధ్యక్షుడి అరెస్టును ఖండిస్తూ ఫ్లెక్సీలు

**చింతకాని-నవభూమి:** మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అక్రమ అరెస్టును ఖండిస్తూ మండల వ్యాప్తంగా పార్టీ గ్రామ, మండల శాఖల ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లలో శనివారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయ్యప్ప మాలధార ణలో ఉన్న పుల్లయ్యను ఉగ్రవాదుల మాదిరిగా తీసుకెళ్లి అరెస్టు చేయడం తగదని, ప్రజాస్వామ్యంలో ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడం సర్వసాధారణమని, నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరునికి రాజ్యాంగం కల్పించిందంటూ ఫ్లెక్సీలపై రాశారు. నిరసనలో పాల్గొన్న వ్యక్తులు, ప్రతిపక్ష నాయకుల పేర్లను చేర్చి వారిని, వారి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం తగదని పేర్కొన్నారు.

## శుభకార్యంలో పాల్గొన్న మాజీ జడ్పీ చైర్మన్



**ఎర్రుపాలెం, నవభూమి, అక్టోబర్ 25:** మండల పరిధిలోని గుంటుపల్లి గోపవరం టిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు మందడపు నరేష్ సోదరుని వివాహానికి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల రాజు శనివారం హాజరై వధూవరులను దీవించారు.ఎర్రుపాలెం మండల టిఆర్ఎస్ నాయకులతో కలిసి హాజరై వరుడిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీఅధ్యక్షుడు పంబి సాంబశివరావు,శ్రీకాంత్ రెడ్డి,అయ్యవారిగూడెం సొసైటీ అధ్యక్షులు అనుమోలు సాంబశివ రావు,మాజీ సర్పంచ్ కోట శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**చర్ల అక్టోబర్ 26 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం రైతు వేదిక దగ్గర సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుగారు. మండలంలో అనారోగ్యంతో ప్రైవేటు హాస్పిటల్లో ట్రీట్మెంట్ పొందిన 8 కుటుంబలకు సంబంధించిన బిల్లులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ కి అప్లై చేయగా వారికి చెక్కుల రావడం జరిగింది. అట్టి చెక్కులను సంబంధితులకు రైతు వేదిక దగ్గర ఇవ్వడం జరిగింది. వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన కలెక్టర్, పోలీస్ కమిషనర్

**ఖమ్మం,నవభూమి,అక్టోబర్ 26:** మధిర పట్టణంలో రూ 24 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కోర్టు భవనాలకు శంకుస్థాపన చేసేందుకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తులు పి శ్రీ సుధ, కాజా శరత్, భీమపాక నగేష్ లను శనివారం ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మర్యాదపూర్వకంగా కలిశారు.



# సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

■ సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీచేసిన ఎమ్మెల్సీ ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్







**ఖమ్మం, నవభూమి, అక్టోబర్26:** బీఆర్ఎస్ పార్టీ అధినేత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సీఎం సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు 60% పైనే మంజూరు చేశారు. నిరుపేదలకు అత్యధికంగా లబ్ధి చేకూర్చే సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ పర్సంటేజ్ ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా పెంచి అందించాలని ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అద్యక్షులు తాతా మధుసూదన్ ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయాలకు అతీతంగా సీఎం సహాయనిధి చెక్కుల మంజూరు కార్యక్రమాన్ని ప్రభుత్వం కొనసాగించాలని,నేడు ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం, తెలంగాణ భవన్ నందు ఎమ్మెల్సీ ,ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ సిఫార్సుతో మంజూరైన 19,16,500 రూపాయలు విలువచేసే 56 చెక్కులను వివిధ లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా తాతా మధుసూదన్ మాట్లాడుతూ గత పదేళ్ల కెసిఆర్ పాలనలో నిరుపేదల కోసం వందలాది లక్షల రూపాయలు సీఎం సహాయ నిధి ద్వారా అందించడం జరిగిందని తెలిపారు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో నిరుపేదలకు, విలువైన వైద్య సేవలు పొందిన అభాగ్యులకు సీఎం సహాయ నిధి అందని ద్రాక్షగా నిలిచిందని, కేసిఆర్ పాలనలో సీఎం సాయి నిధి ద్వారా ప్రతి ఒక్కరిని వంద శాతం ఆదుకునే ప్రయత్నం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రేవంత్ రెడ్డి పాలనలో కూడా బిఆర్ఎస్ పాలనలో కొనసాగించిన విధంగానే సీఎం సహాయ నిధి సహాయ సహకారాలు అవసరమైన పేదలకు అందించే ప్రయత్నం జరగాలని ప్రభుత్వాన్ని కోరారు. లక్షకు పైన ఖర్చయిన కేవలం 30 వేల రూపాయల లోపే సీఎం సహాయ నిధి ద్వారా సహకారం అందితే ఆ పేదల కుటుంబాలకి ఎంతవరకు లబ్ది జరుగుతుందో ఆలోచించాలని సూచించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సీఎం సహాయనిధికి అర్జీ పెట్టుకోవాలనుకున్న ప్రతి పేదవాడికి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సహకారం అందుతుందని వారు తెలిపారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సీఎం సహాయ నిధి సహకారం కోసం వస్తున్న ప్రతి ఒక్కరికి బాసటగా నిలుస్తూ వారికి మేలును కల్పించేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్సీ,ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ కు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అభినందనలు తెలిపారు. నిరుపేదలకు సీఎం సహాయ నిధి చెక్కులను అందించే కృషిలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయానికి తెచ్చే ప్రతి పేద వాడి అప్లికేషన్ కు మేలు జరిగే విధంగా తాతా మధుసూదన్ కృషిని మరింత కొనసాగించాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో కేవలం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ కార్యాలయంలో మాత్రమే నిరుపేదలకు అవసరమైన సిఎం సహాయ నిధి చెక్కులను అందజేసేందుకు నిరంతర ప్రక్రియను కొనసాగిస్తూ ఉండడం హర్షనీయమని, ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాత మధుసూదన్ కు, వారి సిబ్బందికి మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ తన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సిఫార్సుతో మంజూరైన 56 చెక్కుల లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ నాయకులు పోట్ల శ్రీను, దేరంగుల బ్రహ్మం, ముత్యాల వెంకటప్పారావు, పోగుల శ్రీను, ఖమ్మం రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణు, పాలేరు నియోజకవర్గ నాయకులు ఇంటూరి శేఖర్, ఉద్యమకారులు పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, ముదిగొండ మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మారెడ్డి, సద్దాం షేక్ మరియు ఖమ్మం, సత్తుపల్లి ,మధిర నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ సేవలు అందించాలి

■ సీసీఏ తారాచంద్




**కొత్తగూడెం అక్టోబర్ 26 నవభూమి ప్రతినిధి:** డిపార్ట్మెంట్ ఆఫ్ టెలికం తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్ ఎస్ తారాచంద్ కంట్రోలర్ కమ్యూనికేషన్ అకౌంటింగ్ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తో కలిసి జిల్లాలో బిఎస్ఎన్ఎల్, టి ఫైబర్ వారు చేపడుతున్న ఇంటర్నెట్ 4జీ మొబైల్ టవర్స్ అభివృద్ధి పనుల గురించి శనివారం ఐడిఓసి లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా సీసీఏ తారాచంద్ మాట్లాడుతూ నేటి రోజుల్లో సెల్, అంతర్జాల సేవలు చాలా అవసరమని ప్రభుత్వ సేవలు పొందేందుకు ప్రాధాన్యత బట్టి టవర్లు నిర్మాణం చేపడతామన్నారు. జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో కూడా బిఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్, 4జి మొబైల్ సేవలు అందించడం కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తున్నామని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ఇంటర్నెట్, ఫోర్ జి మొబైల్ సేవలు అందించడం కోసం తమ వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని తెలియజేశారు. జిల్లాలో బిఎస్ఎన్ఎల్ వారు చేపడుతున్న అభివృద్ధి పనులు జిల్లా పంచాయతీ, జిల్లా ప్లానింగ్ అధికారుల సమన్వయంతో పూర్తి చేయాలని అన్నారు. మారు మారుమూల ప్రాంతాలలో టవర్లు ఏర్పాటు చేయటానికి ప్రజల్లో రేడియేషన్ గురించి వీడియోల ద్వారా అవగాహన కల్పించాలని అన్నారు. తద్వారా మారుమూల గిరిజన ప్రాంతాలలో నివసిస్తున్న విద్యార్థులు మరియు ప్రజల అభివృద్ధికి దోహదం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, ఎన్ఐసిడిఐజి సుశీల్ కుమార్, బిఎస్ఎన్ఎల్ డీజీమ్ శ్రీనివాస్, ఏటీఎం సుధీర్, ఎస్బిఐ సక్రు నాయక్, షకీల్, బాలాజీ, ఏ ఏ ఓ ఉదయ్, ఓఎస్ శివరాంజీ, టీ ఫైబర్ ఆఫీసర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సిపిఎం పార్టీ నూతన కార్యదర్శిగా ఏకగ్రీవంగా అయినాల రామలింగేశ్వ రావు ఎన్నిక



**తల్లాడ, నవభూమి, అక్టోబర్ 26:** తల్లాడ మండలం సిపిఎం పార్టీ నూతన కార్యదర్శిగా అయినాల రామలింగేశ్వర రావు ఎన్నుకోవడం జరిగింది 15 మందితో మండల కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది ఈ మహాసభలు సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను కార్మికులను యువతలనుఈ ప్రభుత్వల యొక్క ఆర్థిక విధానాల వల్ల వారి యొక్క ఆర్థిక పరిస్థితులు మొత్తం కూడా దెబ్బతిన్న పరిస్థితి ఏర్పడిందని ప్రజల యొక్క ఆర్థిక పరిస్థితులు మెరుగుపడే విధంగా ప్రస్తుతం ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలు లేదు అని ఆయన అన్నారు ప్రస్తుతం ఉన్న యువత నిరుద్యోగం వల్ల యువత మత్తు పదార్థాలకు బానిసలై వారి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఇలాంటి పరిస్థితిలను సరిదిద్దవలసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనికిరాని హామీలు ఇచ్చి ప్రభుత్వం వారి జీవితాల్లో భయభ్రాంతులను గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఈ మహాసభల్లో జిల్లా కార్యవర్గ సభ్యులు మాదిరింది రమేష్ పంతు రాంబాబు మాచర్ల భారతి జిల్లా నాయకులు ఖాతా భాస్కరరావు భూక్య వీరభద్రం శీలం సత్యనారాయణ రెడ్డి షేక్ మస్తాన్ సత్తెనపల్లి నరేష్ పులి కృష్ణయ్య కళ్యాణ కృష్ణయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కార్యకర్తలే టిడిపి పార్టీకి బలమైన పునాది



**బోనకల్, నవభూమి, అక్టోబర్ 26:** తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం ప్రారంభించిన పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం శనివారం హైదరాబాదులోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టి.టిడిపి రాష్ట్ర నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మాట్లాడుతూ..... పార్టీకి కార్యకర్తలే ముఖ్యమని, కార్యకర్తలకు భరోసా ఇచ్చేందుకు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పార్టీ సభ్యత్వాన్ని రెన్యువల్ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లాది హనుమంతరావు, సాదినేని హనుమంతరావు, మధిర మండల నాయకులు మార్నీడు పుల్లారావు, బోనకల్ మండల నాయకులు రావుట్ల సత్యనారాయణ , మహిళా నాయకురాలు తాతా మాధవి, బొర్రా మాధవి,బొర్రా విజయ్, వట్టికొండ మోహన్ రావు అంగడాల గోపి, తదితరులు పాల్గొన్నారు

# టీడబ్ల్యూజేఎఫ్ నేత యూసుఫ్‌కు బెయిల్

## రాష్ట్ర నేతలకు కృతజ్ఞతలు తెలిపిన యూసుఫ్

**హైదరాబాద్, అక్టోబర్ 26, నవభూమి ప్రతినిధి-** అక్రమ కేసులో అరెస్టయి బెయిల్ పై విడుదలైన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నేషనల్ కౌన్సిల్ మెంబర్, సిరిసిల్ల జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్ ను పలువురు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కలిశారు. శనివారం హైదరాబాద్ వచ్చిన యూసుఫ్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, బండి విజయ్ కుమార్, ఎల్గొయి ప్రభాకర్, నేషనల్ కౌన్సిల్ మాజీ సభ్యుడు పద్మనాభరావు తదితరులను మర్యాద పూర్వకంగా కలిశారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి శ్రీసుధ







**ఎర్రుపాలెం,నవభూమి, అక్టోబర్ 25 :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి,ఖమ్మం జిల్లా పోర్టు పోలియో న్యాయమూర్తి జస్టిస్ పి శ్రీ సుధ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్జి శ్రీ సుధకు ఆలయ ధర్మకర్త శ్రీరామచంద్రమూర్తి ప్రధాన అర్చకులు శ్రీనివాస శర్మ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.స్వామివారి ధ్వజస్తంభం వద్ద అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.స్వామివారి పాదముల వద్ద పూజలు నిర్వహించారు.ఆలయం లో పూజలు అనంతరం స్వామివారి మహా మండపంలో జడ్జి శ్రీ సుధ కు అర్చకులు ఆశీర్వచన ములు చేసి స్వామి వారి శేష వస్త్రములను,తీర్థ ప్రసాదములు అందించారు.ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ ఆలయ ప్రాముఖ్యతను గురించి ఆమెకు వివరించారు. హైకోర్టు జడ్జి శ్రీ సుధ మాట్లాడుతూ శనివారం మధిరలో సబ్ కోర్ట్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభోత్సవం సందర్భం గా మధిర రావడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.స్వామివారి మహిమలను గురించి అర్చకులు వివరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో ఖమ్మం జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి బిరాజగోపాల్, మధిర జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కార్తీక్ రెడ్డి, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వాసిరెడ్డి నవీన్ కుమార్,ఎర్రుపాలెం తహసిల్దార్ మన్నె ఉషా శారద,ఆర్ఐ రవికుమార్, ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి,ఎస్సై వెంకటేష్,అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల త్యాగాల వల్లనే స్వేచ్ఛాయుత వాతావరణం

- జిల్లా కలెక్టర్ జితేష్.వి.పాటిల్
- పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం
- వారి స్మరణ మన బాధ్యత
- ఎస్పీ రోహిత్ రాజు







**కొత్తగూడెం అక్టోబర్ 26 నవభూమి ప్రతినిధి:** పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచనల మేరకు శనివారం కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలోశనివారం సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ జితేష్.వి.పాటిల్ పాల్గొన్నారు. ఈ ర్యాలీ లక్ష్మీదేవిపల్లి సెంట్రల్ పార్క్ నుండి మొదలయ్యి, ముర్రేడు వాగు బ్రిడ్జి, గణేష్ టెంపుల్, సూపర్ బజార్, బస్టాండ్ సెంటర్, పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుండి రామవరం మీదుగా రుద్రంపూర్ పార్క్ వరకు సాగింది. ఈ ర్యాలీలో జిల్లా కలెక్టర్,ఎస్పీ గార్లతో పాటు జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణ గౌడ్, ఓఎస్డి సాయిమనోహర్, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, ఎస్బి ఇన్స్పెక్టర్స్ నాగరాజు, శ్రీనివాస్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, కొత్తగూడెం 1టౌన్ సీఐ కరుణాకర్, 2టౌన్ సీఐ రమేష్, 3టౌన్ సీఐ శివప్రసాద్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనా రెడ్డి, ఆర్ఐలు రవి,సుధాకర్, కృష్ణారావు, ఎస్సైలు,స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు. ఎంతో ఉత్సాహంగా ప్రతి ఒక్కరూ ర్యాలీలో పాల్గొని సుమారుగా 13 కిలోమీటర్లు సైకిల్ తొక్కి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారు మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించినందుకు పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలియజేశారు. సందర్భం ఏదైనా సరే నిత్యం ప్రజలకు సేవలందిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడుతూ అహర్నిశలు కష్టపడేది పోలీస్ శాఖ అని అన్నారు.దేశ సరిహద్దుల్లో పహారా కాస్తూ ఉగ్రవాదుల నుండి,విద్రోహక శక్తుల నుండి మనల్ని కాపాడుతూ ఎంతోమంది పోలీసులు తమ ప్రాణాలను కోల్పోయారని అన్నారు.వారి త్యాగాలు చిరస్మరణీయమని, ఎల్లప్పుడూ వారిని స్మరించుకుంటూ ఇలాంటి కార్యక్రమాలను మనం నిర్వహించుకోవాలని అన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రక్తం గడ్డ కట్టే చలిలో దురాక్రమణలను అడ్డుకొని దేశం కోసం తమ ప్రాణాలనర్పించిన పోలీస్ అమరవీరులను ఎప్పటికీ మరువకూడదని అన్నారు. దేశ అంతర్గత భద్రతలో భాగంగా విధులు నిర్వర్తిస్తూ ప్రతి ఏడాది ఉగ్రవాదుల చేతుల్లో, సంఘ విద్రోహక శక్తుల చేతుల్లో ఎంతోమంది పోలీసులు తమ ప్రాణాలను కోల్పోవడం జరుగుతుందని తెలిపారు.వారందరిని స్మరించుకుంటూ ఈ నెల 21 నుండి 31 వరకు ఈ సంస్మరణ కార్యక్రమాలను జరుపుకుంటున్నామని తెలియజేసారు. విధి నిర్వహణతోపాటు పోలీసు అధికారులు సిబ్బంది తమ దైనందిన జీవితంలో ఏదో ఒక వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.

## ఎమ్మెల్యే జారె ఆదినారాయణను మర్యాదపూర్వకంగా కలిసిన సిడబ్ల్యూఓ లెనీన





**దమ్మపేట అక్టోబర్ 26 నవభూమి:** నూతనంగా సిడబ్ల్యూఓ బాధ్యతలు చేపట్టిన లెనీన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే స్త్రీ శిశు సంక్షేమం గురించి నియోజకవర్గంలో ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలియజేశారు అలాగే స్త్రీ శిశు సంక్షేమ జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ సఖి వన్ స్టాప్ సెంటర్ హెల్ప్ లైన్ నెంబర్ 181 పోస్టర్ను ఐసిడిఎస్ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ హెల్ప్ లైన్ ద్వారా గృహహింస వరకట్న వేధింపులు పనిచేసే ప్రదేశాలలో వేధింపులు లైంగిక వేధింపులు ఆడపిల్లల అమ్మకం, వారి అక్రమ రవాణాను నివారించడానికి 24 గంటలు అందుబాటులో ఉంటుందని అత్యవసర పరిస్థితులలో 181 హెల్ప్ లైన్ నెంబర్ ను మహిళలు వినియోగించుకోవాలని సూచించారు.

## నెహ్రూ విగ్రహా పునః ప్రతిష్టకు మోక్షం ఎప్పుడు?



**గార్ల, నవభూమి, అక్టోబర్ 26:** మండల కేంద్రమైన గార్ల లోని నెహ్రూ విగ్రహా పునః ప్రతిష్టకు మోక్షం లభించ లేకపోవడం విగ్రహ దిమ్మ ప్రేక్షకుడిలా ఉండి పోయింది. దివంగత భారత మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ అస్తమయం తర్వాత 1964 సంవత్సరంలో నాటి గార్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు గార్ల మెయిన్ సెంటర్ లో విగ్రహ దిమ్మ ఏర్పాటు చేసి జవహర్ లాల్ నెహ్రూ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నాటి నుంచి సుమారు రెండు సంవత్సరాల వరకు నెహ్రూ జయంతి, వర్థంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఎన్నికల ముందు లారీ తగిలి విగ్రహ దిమ్మ విరిగి పడిపోగా లారీ యజమాని, స్థానికుల సహాయంతో తిరిగి నూతన విగ్రహ దిమ్మ ను నిర్మాణం చేశారే తప్ప విగ్రహ పునః ప్రతిష్ఠ జరపలేదు. ఎంతో ప్రఖ్యాతి గాంచిన నెహ్రూ సెంటర్ లో విగ్రహం లేకుండా ఖాళీ దిమ్మ తో దర్శనమివ్వడం, పలు పార్టీల నేతలు, ఇతరులు తమ నాయకుల శుభాకాంక్షలు, జయంతి, వర్థంతి వేడుకల బ్యానర్లు ఏర్పాటు చేస్తుండటంతో ఇదేం చోద్యం మంటూ విచిత్రం మాట్లాడుకుంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు, నాయకులు చొరవ చూపి విగ్రహ దిమ్మ రంగులు పూయించి నెహ్రూ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠ జరపాలని స్థానికులు కోరుతున్నారు.

# ఉపాధి హామీ సామాజిక తనిఖీ

■ **పలు అవకతవకలపై ఆగ్రహం**





**టేకులపల్లి అక్టోబర్ 26 నవభూమి ప్రతినిథి :** టేకులపల్లి మండల పరిషత్ కార్యాలయంలోఎంజిఎన్ఆర్ ఇజిఎస్ 15వ విడత సామాజిక తనిఖి ప్రజా వేదికను జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవి శనివారం నిర్వహించారు. మొత్తం 575 పనులకుగాను ఖర్చు రూ. 4,77,62,179, మెటీరియల్ ఖర్చు రూ. 25,80,666, మొత్తం విలువ రూ.5,03,43,385. పలు గ్రామపంచాయతీ నుండి రూ. 24,096 రికవరీ చేసామని, రూ. 22,500 జరిమానా విధించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీలో జరిగే చిన్నచిన్న లోపాలను సరిదిద్దేందుకే సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరు కలిసి పనిచేస్తేనే పథకం ముందుకెళ్తుందన్నారు. పలు గ్రామపంచాయతీలో అభ్యంతరాలను గుర్తించామన్నారు. కొన్ని గ్రామాల్లో పనికి వెళ్లకున్నా, వారి స్థానంలో కుటుంబ సభ్యులు చేసినట్లు డబ్బులు చెల్లించారన్నారు. మస్టర్ నిర్వహణ, ఇతర రికార్డులను సక్రమంగా రాయలేదని అసహనం వ్యక్తం చేశారు. సెలవు దినాలలో పనిచేసినట్లు చూపించి చెల్లింపులు చేసినట్లు గుర్తించారు. మొక్కలు నాటినట్లు రికార్డుల్లో ఉన్నా, క్షేత్రస్థాయిలో పరిశీలించగా, అక్కడ మొక్కలు లేవని గుర్తించారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనుల్లో తప్పిదాలకు గుర్తించి క్షేత్రసహాయకులు టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, టీఎలను మందలించారు. తొలగించిన, నాటని మొక్కలు నాటినట్లు చూపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో బోర్డులు ఏర్పాటు చేయక పోవడం విడ్డురంగా ఉందన్నారు. జాబ్ కార్డులు అడిగిన వారికీ ఇవ్వలేదన్న ఫిర్యాదుపై స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి ఎం సాయి జ్ఞానేందర్, జిల్లా విజిలెన్స్ అధికారి రమణ, ఎంపీడీవో రవీంద్ర రావు, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి అనూష, అంబుడ్స్ మెన్ ప్రకాష్, క్వాలిటీ కంట్రోల్ అధికారి ప్రకాష్, ఎంపీఓ గణేష్ గాంధీ, స్టేట్ రిసోర్స్ పర్సన్ ఏ రమేష్, ఏపీవో కాలంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, కార్యదర్శులు ఉపాది హమి సిబ్బంది పాల్గొన్నారు

# అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి

■ **కార్పోరేషను అవినీతి నిలయంగా మార్చిన అధికారులు ఏఐటీయుసి డిమాండ్**




**ఖమ్మంనగరం, నవభూమి, అక్టోబర్ 26:** నగర పాలక సంస్థలో అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయుసి డిమాండ్ చేసింది. నగర పాలక సంస్థలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని గత కలెక్టర్ పలుమార్లు టౌన్ ప్లానింగ్ అధికారులను హెచ్చరించినా తమ తీరు మార్చుకోలేదని ఏఐటీయుసి నేతలు పేర్కొన్నారు. ఏఐటీయుసి జిల్లా,అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ,తోట రామాంజనేయులు, జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు రావిశివరామకృష్ణ తదితరులు ఏఐటీయుసి ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ 2018 నుంచి 2023 సంవత్సరం వరకు జరిగిన అవినీతి పనుల్లో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లపైన విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. క్రింది స్థాయి అధికారులను తమ అధికారంతో చెప్పు చేతల్లో ఉంచుకుని ఒక అవినీతి వలయాన్ని ఖమ్మం కార్పోరేషన్లో ఏర్పాటు చేశారని వారు తెలిపారు. కాంట్రాక్టర్లకు సహకరిస్తూ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్న అధికారులపై విచారణ జరిపించాలని విజిలెన్స్ విచారణ తర్వాత నివేదికను ప్రజల ముందు ఉంచాలని ఏఐటీయుసి డిమాండ్ చేసింది. పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలని 2018లో జనరల్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం,అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్లతో మిలాఖత్ కారణంగానే అమలు చేయలేదన్నారు. నగర పాలక సంస్థలో బిల్ కలెక్టర్ నుండి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వరకు అవినీతిలో మునిగారన్న వార్తలు వినిపిస్తున్నా ఉన్నతాధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారని నాలుగైదేళ్లుగా కార్పోరేషన్ లో పాలనన లేదని వారు అన్నారు. విచారణ జరిపి తక్షణం పక్కదారి పట్టిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని,చర్యలు తీసుకోని పక్షంలో ఏఐటీయుసి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

# పత్తి క్వింటాకు రూ.15 వేలు ఇవ్వాలి

■ **మండలంలోని చిల్లర కౌంటర్లను ఎత్తివేయాలి**



**టేకులపల్లి అక్టోబర్ 26 నవభూమి ప్రతినిథి:** టేకులపల్లిలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ మండల కమిటీ సమావేశం బానోతు లింగ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో టేకులపల్లి మండల కార్యదర్శి ధర్మపురి వీరబ్రహ్మాచారి మాట్లాడుతూ, ఈ సీజన్లో రైతులు పంట వేసి అతివృష్టి, అనావృష్టికి గురై పంటలు అనుకునేంతగా దిగుబడి రాక రైతులు అప్పులు పాలవుతున్నారు. దీనికి తోడు గిట్టుబాటు ధర లేక అతి తక్కువ రేటుకు పంటలు అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులకు మేలు చేస్తామని మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ గవర్నమెంట్ ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి, కాలయాపన చేస్తూ రైతు సమస్యలను మర్చిపోయారని దుయ్యబట్టారు. ఇప్పటికే రైతు భరోసా ఎగ్గొట్టారని, రైతు రుణమాఫీ సగం మందికి కూడా కాలేదని, తక్షణమే రైతు రుణమాఫీ చేయాలని, రైతు భరోసా రైతు ఖాతాలో వేయాలని, అన్ని పంటలకు 500 రూపాయలు బోనస్ ఇవ్వాలని రైతు బీమా పంటల భీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గ్రామాలలో పత్తి చిల్లర కౌంటర్ల ద్వారా ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారని, వారిపై వెంటనే చర్యలు తీసుకొని చిల్లర కౌంటర్లను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు జరుపుల సుందర్, మండల నాయకులు బి. పంతులు, బి.లింగ, ఏనూటి నాగయ్య పాల్గొన్నారు.

# చర్ల మండల స్థాయి అధికారుల సమీక్షా సమావేశం: పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు





**చర్ల అక్టోబర్ 26 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం రైతు వేదిక కార్యాలయంలో మండల స్థాయి అధికారుల సమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలపై అధికారుల దగ్గరికి వస్తే వారి సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గం చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తాహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఉదయ్, సిడిపిఓ చైతన్య, ఏవో నవీన్ చర్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, టిపిసిసి నెంబర్ నల్లపు దుర్గాప్రసాద్, చర్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, ఇందల బుచ్చిబాబు, ఎంపిటిసి మడకం పద్మ, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు భవన నిర్మాణాలకు భూమి పూజ చేసిన హైకోర్టు న్యాయమూర్తి పి. శ్రీ సుధ



**ఖమ్మం–నవభూమి:** మధిర పట్టణంలో రూ. 24 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 2 కోర్టు కాంప్లెక్స్ లు, రూ. 39 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న రికార్డ్స్ భవన నిర్మాణ పనులకు శనివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, ఖమ్మం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి పి. శ్రీ సుధ, హైకోర్టు న్యాయమూర్తులు భీమపాక నగేష్, కాజా శరత్, ఖమ్మం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ న్యాయమూర్తి జి. రాజగోపాల్ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా భవన ప్లాన్ ను న్యాయమూర్తులు పరిశీలించారు. పనులు ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని న్యాయమూర్తులు అన్నారు.

అనంతరం రిక్రియేషన్ క్లబ్ కాంప్లెక్స్ లో నూతనంగా ఏర్పాటు చేసిన సీనియర్ సివిల్ కోర్ట్ ను న్యాయమూర్తులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మధిర సీనియర్ సివిల్ కోర్ట్ న్యాయమూర్తి మీరా ఖాసీం సాహెబ్, మధిర మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షులు బోజడ్ల పుల్లారావు, ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, మధిర మునిసిపల్ కమీషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ రాంబాబు, న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, దిరిశాల జగన్మోహన్ రావు, కట్ల పూర్ణచంద్రరావు, చావలి రామరాజు, కాపూరి రమేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# సాయి స్ఫూర్తిలో ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్‌పై వర్క్ షాప్



**సత్తుపల్లి, నవభూమి, అక్టోబర్ 26 :** మండల పరిధిలోని గంగారం గ్రామంలో ఉన్న సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఈసిఈ థర్డ్ ఇయర్ ఇంజనీరింగ్ విద్యార్థినీ, విద్యార్థులకు శుక్రవారం, శనివారం ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశం పై వర్క్ షాప్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆర్బిట్ లెర్నింగ్ ట్రైనర్ ఎం.అభినవ్ మాట్లాడుతూ విద్యార్థినీ , విద్యార్థులు బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగాలు పొందేందుకు ఈ టెక్నాలజీ ఐ.ఓ.టి (ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్) ఉపయోగపడు తుందన్నారు. ఈ.ఎస్.పి 32 అనేది టి.ఎస్.ఏం.ఎస్ లో పవర్ 40 ఎన్.ఎం రూపొందించబడిన ఒకే 2.4 గిగా హెర్ట్జ్ వై ఫై, బ్లూటూత్ కాంబో చిప్ కృషి చేస్తుందన్నారు. సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమీప భవిష్యత్తులో దేశ, విదేశాల్లో గణనీయమైన స్థాయిలో ఉద్యోగాలు సాధించవచ్చన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరు శేషారత్నకుమారి మాట్లాడుతూ మూడవ సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులు టెక్నికల్, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రోగ్రామింగ్, స్కిల్స్ పై ట్రైనింగ్ పొందటం వల్ల ఇంటర్వ్యూలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు అన్నారు. మంచి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు .ఈ కార్యక్రమంలో హెచ్.ఓ.డి లు డా. శేఖర్ బాబు, పి.నాగశేఖర్ లు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంత రైతులను మోసం చేస్తే సహించేదే లేదు

■ భద్రాచలం కాంగ్రెస్ పార్టీ రైతు సంఘం అధ్యక్షులు ఇందల బుచ్చిబాబు



**దుమ్ముగూడెం అక్టోబర్ 26 నవభూమి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం నల్లబెల్లి గ్రామంలో పత్తి రైతులను మోసం చేస్తున్న ఇతర ప్రాంతాల దళారులు సుమారు సంవత్సర కాలం నుండి ఇదే పద్ధతిలో కంప్యూటర్ కాటాకి రిమోట్ అమర్చుకొని 10 నుండి 15 కిలోల వరకు పత్తి చాకచక్యంగా కొట్టేస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. తాజాగా గురువారం దుమ్ముగూడెం మండలం నల్లబెల్లి గ్రామంలో ఓ రైతు తన పత్తి అమ్ముతుండగా అక్కడ మేము కొంటామని కొందరు దళారులు వచ్చి రైతుతో బేరం కుదిరించుకొని కంప్యూటర్ కి సంబంధించిన కాటా అమర్చి సుమారు కింట పత్తిలో 10 నుండి 15 కేజీలు తక్కువ చూపిస్తున్నట్టు రైతులు ఆరోపించారు దీనిపై చుట్టుపక్కల రైతులు సదరు దళారులను పట్టుకొని విచారించగా రిమోట్ ద్వారా కాట నెంబర్లు మారుస్తున్నట్టు గమనించిన రైతులు దళారులను పట్టుకొని పోలీస్ లకు అప్పగించారు. భద్రాచలం డివిజన్ పరిధిలో ఏదేమైనా ఏజెన్సీ ప్రాంతంలో అమాయకమైన గిరిజన రైతులను దళారులు ఇష్టానుసారంగా దోసుకుంటున్నారని. అన్యాయంగా గిరిజనులను మోసం చేస్తున్నారని భద్రాచలం కాంగ్రెస్ కిసాన్ మోర్చా అధ్యక్షులు ఇందుల బుచ్చిబాబు మండిపడ్డారు దీనిపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తాం అన్నారు. ఇటువంటి మోసాలకు పాల్పడే దళారులు ఎవరైనా ఎంతటి వారైనా సహించేది లేదని కచ్చితంగా ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వం కచ్చితంగా రైతుల పక్షాన నిరంతరం పోరాడుతూనే ఉంటుందని ఏజెన్సీ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని కొందరు ఆసరాగా చేసుకొని లక్షల రూపాయలు జేబులు నింపుకుంటున్నారని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టంగా చర్యలు తీసుకుంటామని ఇందల బుచ్చిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లబెల్లి గ్రామం రైతులు ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయం

■ తల సేమియా వ్యాధిగ్రస్తుల కోసం మెగా రక్తదానం శిబిరం

■ ఇల్లందు డీఎస్పీ చంద్రబాను

**ఇల్లెందు టౌన్ అక్టోబర్ 26 నవభూమి ప్రతినిధి:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఇల్లందు సబ్ డివిజన్ పోలీస్ అధికారి చంద్రబాను, ఇల్లందు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ వ్యాప్తంగా పోలీసు అధికారులు పాల్గొని పోలీస్ అమరవీరుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా తల సేమియా వ్యాధిగ్రస్తుల వారి కోసం మెగా రక్తదాన శిబిరాన్ని స్థానిక అయితా కాంప్లెక్స్ లో ఏర్పాటు చేశారు. రక్తదానం అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తాన్ని అందించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డీఎస్పీ చంద్రబాను మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. అమరవీరుల దినోత్సవం సందర్భంగా రక్తహీనత కలిగి ఉండి తల సేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి రక్తం అందించాలని సంకల్పంతో సబ్ డివిజన్ పరిధిలో సబ్ డివిజన్ కేంద్రంగా ఉన్న ఇల్లందులో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. ఈ శిబిరంలో రక్తాన్ని అందించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇల్లందు సబ్ డివిజన్ పరిధిలోని గుండాల, ఆళ్లపల్లి, కొమరారం, టేకులపల్లి, ఇల్లందు, బోడు స్టేషన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది అధికారులు పాల్గొని రక్త దానం చేశారు. వీరితోపాటు స్థానిక పలువురు పాత్రికేయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థ వారు పాల్గొని చేశారు.. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.









# లారీ ట్యాంకర్ల నుండి డీజిల్ అపహరణ



**సత్తుపల్లి నవభూమి అక్టోబర్ 26 :** జలగం వెంగళరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో రాష్ట్రీయ రహదారిపై ఆగి ఉన్న మూడు లారీల ట్యాంకర్ల తాళాలను పగలగొట్టి సుమారు తొంబై వేల రూపాయల ఖరీదు చేసే 900 లీటర్ల డీజిల్ ను అపహరించిన సంఘటన శుక్రవారం పట్టణంలో అర్ధరాత్రి జరిగింది. డెక్కన్ సిమెంట్ కు చెందిన మూడు లారీలు విశాఖపట్నం నుంచి బొగ్గులోడుతో హైదరాబాద్ వెళుతున్నాయి. అర్ధరాత్రి డ్రైవర్లకు నిద్ర రావడంతో రాష్ట్రీయ రహదారి పక్కన లారీలను నిలిపి నిద్రపోయారు. తెల్లవారుజామున తిరిగి ప్రయాణం అయ్యే సమయంలో డీజిల్ చోరీకి గురైనట్లు డ్రైవర్లు గుర్తించారు. ఒక్కో లారీ ట్యాంకర్ లో 300 లీటర్ల డీజిల్ ఉందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు

# జర్మనీలో ఉద్యోగాలకై నైపుణ్యం గల అభ్యర్థులకు అక్టోబర్ 29న ఎన్రోల్మెంట్ డ్రైవ్

### జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎన్. మాధవి

### ఖమ్మం టాస్క్ ప్రాంతీయ కేంద్రం, ఐటి హబ్‌లో అక్టోబర్ 29న ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహణ

### ఆసక్తి గల అభ్యర్థులు తమ పేర్లను వెబ్సైట్, మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలి

**ఖమ్మం,కలెక్టరేట్, నవభూమి, అక్టోబర్ 26:** జర్మనీ దేశంలో ఆటోమోటివ్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్, హెవీ మోటర్ వాహన డ్రైవర్, ఆస్బిల్ డంగ్ (అప్రెంటిస్ షిప్)గా పని చేయుటకు నైపుణ్యం గల అభ్యర్థుల కోసం ఈనెల 29న ఖమ్మం ఐ.టి. హబ్ గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న టాస్క్ ప్రాంతీయ కేంద్రంలో టామ్ కామ్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ ను నిర్వహించనున్నదని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకొని హాజరు కావాలని జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎన్. మాధవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ క్రింద నమోదు చేయబడిన రిక్రూట్మెంట్ ఏజెన్సీ టామ్ కామ్ అని, దీని ద్వారా తెలంగాణ నుండి అర్హత, నైపుణ్యం కలిగిన వారికి ఉద్యోగాలు కల్పించేందుకు విదేశాలలో ప్రభుత్వ, ప్రైవేట్ రిజిస్టర్డ్ ఏజెన్సీలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నదని తెలిపారు. జర్మన్ భాషపై శిక్షణను టామ్ కాం ద్వారా ఎంపిక చేయబడిన అభ్యర్థులకు అందించబడతాయని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు టామ్ కామ్ వెబ్సైట్, మొబైల్ యాప్‌లో నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం **www.tomcom.telangana.gov.in** ని సందర్శించాలని, 9440052592 / 8125251408 / 9440049013 / 9440049645 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో తెలిపారు.

# ఎస్సీ ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల ఖర్చుపై సమీక్షిస్తాం

### డిబిఎఫ్ బృందానికి రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హామీ

**కంటోన్మెంట్, నవభూమి ప్రతినిధి ,అక్టోబర్ 26 :**దళిత,గిరిజన ప్రత్యేక అభివృద్ధి నిధుల ఖర్చుతో పాటు సంక్షేమ పథకాల అమలు పై త్వరలో సమీక్ష నిర్వహించి అభివృద్ధి ఫలాలు ఎస్సీ ఎస్టీ లకు అందే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి నిధుల పై కమిషన్ సమీక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్,జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్వర్యంలో డిబిఎఫ్ బృందం

# ప్రజాభిప్రాయ సేకరణపై అవగాహన కల్పన

■ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి





**ఖమ్మం,నవభూమి బ్యూరో, అక్టోబర్ 26:** స్థానిక సంస్థలలో వెనుకబాటుతనంపై నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం పట్ల అవగాహన కల్పిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి తెలిపారు. శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి కలెక్టరేట్ లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో జిల్లాలో ఉన్నటువంటి బి.సి., ఎం.బి.సి. కుల సంఘ నాయకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థలలో వెనుకబాటుతనం యొక్క స్వభావం, ప్రభావాన్ని సమకాలీన, క్షుణ్ణమైన, అనుభవపూర్వక విచారణను నిర్వహించడానికి ప్రత్యేక బి.సి. కమీషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. బీసీ కమిషన్ చే నవంబర్ 5 న ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రతి వర్గం వారు వారి అభిప్రాయాలు, సమస్యలను ఆరు సెట్లలో వెరిఫికేషన్ ఆఫిడవిట్ తో పాటుగా (రూ.20/- నాన్-జ్యుడీషియల్ స్టాంపు పేపరుపై) తెలుగు లేదా ఆంగ్లం, ఏదైనా భాషలో తెలంగాణ వెనుకబడిన తరగతుల కమీషన్ వారికి అందజేయాలని తెలిపారు. ఈ అవగాహన సమావేశంలో బీసీ సంఘ నాయకులు మామిడి వేంకటేశ్వర్లు, వీరమల్ల ఊర్మిళ, మరళా లింగయ్య గౌడ్, పెళ్లూరి విజయ్ కుమార్, పెరుగు వెంకటరమణ యాదవ్, గద్దె వెంకటరామయ్య, ఆకుల గాంధీ, పల్లెపు సోమరాజు, షేక్ షకీనా, డా. కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

### చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై

# కఠిన చర్యలు తీసుకోవాలి

■ రౌడీ షీటర్లు,సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా

■ ఇల్లెందు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

**ఇల్లెందు టౌన్ అక్టోబర్ 26 నవభూమి ప్రతినిధి:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం ఇల్లెందు పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి కేసులు నమోదవుతాన్నాయో తెలుసుకుని, వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులు, సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ కు సంబంధించిన రికార్డులను, ఫైళ్లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుంటూ, ఒక క్రమ పద్ధతిలో అమర్చుకోవాలని సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి విధుల పరంగా ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. తమ పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు కలిగిస్తే అట్టి వారిపై ఉక్కుపాదం మోపాలని అన్నారు. అనంతరం ఇల్లందు పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను అడిగి వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి చంద్రభాను, సిఐ బత్తుల సత్యనారాయణ, ఎస్సై నాగుల్ మీరా, సూర్య, సిబ్బంది పాల్గొన్నారు.









# సిఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు ఆసరా

**కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**166 మంది లబ్ధిదారులకు రూ.61.65లక్షల విలువచేసే చెక్కులు అందించిన ఎమ్మెల్యే**









**కొత్తగూడెం అక్టోబర్ 26 నవభూమి ప్రతినిధి:** సిఎం రిలీఫ్ ఫండ్ పథకం పేద కుటుంబాలకు వరమని, ప్రతి పేద కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని 166 మంది సిఎంఆర్ఎఫ్ పథకం క్రింద రెండో దఫా మంజూరైన చెక్కులను శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ లో లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ గత ప్రభుత్వం విధించిన రూ.60వేల కటాఫ్ నిబంధనను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగించడం వల్ల పేద కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ నిబంధనను సడలించాలని కోరారు. అత్యవసర పరిస్థితిలో వైద్యంకోసం పేదలు వెచ్చించి ప్రతి పైసా ప్రభుత్వం తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో బలోపేతం చేస్తే పేదలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి నష్టపోయేపరిస్థితి ఉండదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం పేదలకు అందేలా చొరవ తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, ఎస్ కె ఫేహీమ్, పొలమురి శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు నునవాత్ గోవిందు, గోపాల్ రావు, బోయిన విజయకుమార్, దుర్గ, సత్యనారాయణ చారి, మురళి, లక్ష్మీనారాయణ, సపవట్ రవి ఖయుమ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఉపాధ్యాయులు నూతన ఉత్సాహంతో

# సమాజం పట్ల బాధ్యతగా విధులు నిర్వహించాలి

■ **జిల్లా కలెక్టర్ శ్రీ జితేష్ వి పాటిల్**

**కొత్తగూడెం అక్టోబర్ 26 నవభూమి జిల్లా బ్యూరో:** డీఎస్సీ ద్వారా నూతనంగా ఉద్యోగంలోకి ప్రవేశించిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు నిబద్ధతతో సమాజం పట్ల బాధ్యతతో తమ విధులు నిర్వర్తించి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో నమోదు నిలకడలను పెంచడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. జిల్లాలో నూతనంగా ఉద్యోగం పొందిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులతో జిల్లా విద్యా శిక్షణా కేంద్రం కొత్తగూడెం నందు ముఖాముఖి చర్చలో పాల్గొన్న ఆయన ఉపాధ్యాయులకు అనేక అంశాలపై దిశా నిర్దేశం చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన పిల్లలకు కావలసిన సదుపాయాల అందించడంలో జిల్లా యంత్రాంగం బాధ్యత తీసుకుంటుందని, పిల్లల నమోదు పెంచటం నిలకడను సాధించడం పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం, పిల్లలను సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటం వంటి బాధ్యతలను ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. నూతనంగా ఉద్యోగం సాధించిన స్ఫూర్తితో మంచి సమాజ నిర్మాణంలో భాగస్వాములు అవ్వాలని విద్యార్థిని విద్యార్థులను తమ సొంత పిల్లగా భావించి వారికి సదా అండగా నిలబడి విద్యను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహణ, యుడైస్ పోర్టల్, సమగ్ర శిక్ష అంశాలు, దివ్యాంగ పిల్లలకు సంబంధించిన అంశాలు, క్వాలిటీ ఎడ్యుకేషన్ కి సంబంధించిన అంశాలు మొదలైనవి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు డాక్టర్ ప్రభు దయాళ్, ఎన్. సతీష్ కుమార్, ఎస్.కె సైదులు, ఏ, నాగరాజశేఖర్, ఎస్ శ్రీనివాస్ వివరించారు. ముందుగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకటేశ్వర చారి మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులందరూ పిల్లల అభివృద్ధికి పాటుపడుతూ, భద్రాద్రి జిల్లాను విద్యారంగంలో ముందు వరుసలో నిలబెట్టాలని సూచించారు.









# రుణమాఫీని తక్షణం పూర్తి చేయాలి

■ **రైతు భరోసాను విడుదల చేయాలి**

■ **28న కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా**




**ఖమ్మంనగరం, నవభూమి, అక్టోబర్26:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రూపాయల రుణమాఫీని తక్షణం అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు డిమాండ్ చేశారు. ఆగస్టు 15 నాటికే పూర్తి చేస్తామన్న రుణమాఫీ ఇప్పటి వరకు సగం కూడా పూర్తి కాలేదని లక్ష లోపు రుణాలు కూడా పూర్తి చేయకపోవడం – శోచనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సమితి సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గోవిందరావు మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దాటవేత –ధోరణిని అవలంభిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షలకు పైగా రైతులకు రుణమాఫీ జరగలేదని ఈ విషయంలో రోజుకో ప్రకటన ఇస్తున్నారని ఇది రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందని గోవిందరావు తెలిపారు. రైతుబీమా అమలు చేయడంతో పాటు సన్న వడ్లతో పాటు ఇతర రకాల ధాన్యానికి కూడా రూ. 500 బోనస్ ఇవ్వాలని భూ హక్కుల చట్టాన్ని త్వరితగతిన "అమలు చేయాలని గోవిందరావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.15వేల చొప్పున ఖరీఫ్, రబీల్లో ఇస్తానని చెప్పారని కానీ ఖరీఫ్ లో రైతుల ఖాతాల్లో జమ చేయలేదని ఆయన తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి యాసంగి నుంచి రైతు భరోసా అమలు చేస్తామని చెప్పడం చూస్తుంటే వానాకాలం పంటలకు భరోసా లేనట్లేనని అవగతమవుతుందన్నారు. రైతాంగ –సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 28న సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు గోవిందరావు తెలిపారు. పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు మిడికంటి –వెంకటరెడ్డి, పుచ్చకాయల సుధాకర్, యడ్లపల్లి శంకరయ్య, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏ మతోన్మాదం అయినా దేశానికి ప్రమాదకరం

**హైదరాబాద్, అక్టోబర్ 26, నవభూమి ప్రతినిధి–** మతం వేరు, మతోన్మాదం వేరు అని, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మతోన్మాదంను వ్యతిరేకించాలని... ఇది యావత్ దేశానికి అత్యంత ప్రమాదకరమని జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఖద్దిసి రమణమూర్తి అన్నారు. దేశాన్ని కాపాడాలంటే హిందూ ముస్లిం ఐక్యతే ఏకైక మార్గమని అన్నారు. మత సామరస్యం, అన్ని మతాల్లో అసమానతల నిర్మూలనపై జైభారత్ ఉద్యమం మొదటి నుండి కృషిచేస్తుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. జంట నగరాల ఖదిజ్ఞాసి ధ్యాన సమాలోచన సమావేశంలో భాగంగా శనివారం ఉదయం మెహిదిపట్నంలోని ఆల్ఫా ప్లాజాలో గ్రేటర్ హైదరాబాదు ప్రభాత ధ్యాన భేరి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రధాన వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ మనిషి పరిపూర్ణమైన వ్యక్తిత్వానికి ఖద్దిసి ధ్యానం చేయడమే ఏకైక మార్గమని అన్నారు. ఈ ధ్యానం అత్యంత హేతుబద్ధమైన ధ్యాన ప్రక్రియ అని అన్నారు. సమావేశం ముగింపు సందర్భంగా పాల్గొన్న సభ్యులందరూ ఖద్దిసి చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ పి ఈ జాతీయ అధ్యక్షులు త్రినాథ దాసు, అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామి, జైభారత్ జాతీయ కార్యదర్శులు జైభారత్ సభ్యులు పాల్గొన్నారు.

# అభివృద్దే పరమార్ధంగా పని చేస్తా :గౌసుద్దీన్



**కారేపల్లి,నవభూమి, అక్టోబర్26:** రాబోయే సర్పంచ్ ఎన్నికలలో ఆదరించండి... అడబిడ్డల పెళ్ళికి కానుక ఇస్తా... పండుగలకు చీరలు పంచుతా నంటూ ఆకర్షనీయమైన మేనిఫెస్టోను విడుదల చేశాడూ కారేపల్లికి చెందిన బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు షేక్ గౌసుద్దీన్. నిరంతరం సేవా కార్యక్రమాలతో ప్రజలలో ఉంటే గౌసుద్దీన్ గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకోని ముందస్తుగానే సర్పంచ్ గెలిస్తే తాను చేయబోయే కార్యక్రమాలను కరపత్రం రూపంలో మేనిఫెస్టోను తయారు చేసి పంపిణి చేస్తున్నాడు. సింగరేణి గ్రామాన్ని ఆదర్శపంచాయతీగా తీర్చిదిద్దుతానని, సేవే పరమార్ధంగా నిరంతరం ప్రజలలో ఒకడిగా ఉంటానంటూ వాగ్ధానం చేస్తూ ప్రభుత్వం నిధులతో పాటు తన సొంతంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తానని మేనిఫెస్టో లో పేర్కొన్నాడు. ప్రతి ఇంటికి మినరల్ వాటర్, సైడ్ డ్రైనేజీలు, ప్రతి గల్లికి సీసీరోడ్లు, స్మశాన వాటికల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపాడు. సొంత నిధులతో ఆడపిల్ల పెళ్లి కానుక రూ.10116, బతుకమ్మ చీరలు, రంజాన్ తోపా, దివ్యాంగులకు 10 కిలోల సన్న బియ్య, గుడిలోని పూజార్లు, మసీద్ మొజన్,మొలిసాబ్‌లకు ఏడాదికి రూ.10వేలు, గ్రామంలో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి రూ.10వేలు అందిస్తానంటూ తన మేనిఫెస్టోలో పేర్కొన్నాడు.తనను ఆశీర్వదించండి... పదితరాలు గుర్తుండేలా అభివృద్ధి చేసి చూపుతానంటూ మేనిఫెస్టోలో తాను చేయబోయే పనులను పేర్కొన్నాడు. గౌసుద్దీన్ మేనిఫెస్టో అందరిని ఆకర్షిస్తుంది. సింగరేణి గ్రామపంచాయతీ కులలగణన అనంతరం బీసీ అవుతుందనే ధీమాతో గౌసుద్దీన్ తన ప్రచారపర్వానికి సాగిస్తున్నాడు.

# సిపిఎం మండల కార్యదర్శిగా సత్యవతి



**గార్ల, నవభూమి, అక్టోబర్ 26:** సిపిఎం గార్ల మండల కార్యదర్శిగా గార్లకు చెందిన అలవాల సత్యవతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వర్తక సంఘం భవనం లో జరిగిన పార్టీ మండల మహా సభలో తీసుకున్న నిర్ణయాలు, మండల కార్యదర్శి ఎన్నిక వివరాలను పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాస్ శని వారం వెల్లడించారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శిగా నియామకమైన విద్యార్థి దశ నుంచి సిపిఎం పార్టీ అనుబంధ సంఘాల్లో చురుకైన పాత్ర పోషించారు. కార్యదర్శి గా సత్యవతి నియామకం కావడం పట్ల పలువురు పార్టీ సీనియర్ నాయకులతో పాటు,ఇతర పార్టీల నాయకులు అభినందించారు.

# ఘనంగా జర్నలిస్ట్ రామనారాయణ జన్మదిన వేడుకలు

**ఖమ్మం, నవభూమి అక్టోబర్ 26**: టి యు డబ్ల్యు జే (ఐ జే యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోల రామనారాయణ జన్మదిన వేడుకలు ఖమ్మంలోని ఆయన స్వగృహంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు అందజేశారు. అనంతరం పలువురు పాత్రికేయులు రామనారాయణను పుష్పగుచ్ఛాలతో శాలువాలు కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పత్రికా రంగానికి రామనారాయణ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రామనారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల అభ్యున్నతికి తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జే (ఐ జేయు) రాష్ట్ర, జిల్లా, నగర కమిటీ నాయకులు పాల్గొన్నారు.



# విద్యార్థులు యువకులు దేశానికి నాయకత్వం వహించాలి

- విద్యార్థులు మొబైల్ ఫోన్లకు అంకితం కావొద్దు
- చదువులో వెనుకబాటుకు మొబైల్లే కారణం
- మిస్ట్‌లో వీక్షిత్ భారత్‌పై సెమినార్






**సత్తుపల్లి, నవభూమి, అక్టోబర్ 26 :** విద్యార్థినీ, విద్యార్థులు, యువత దేశానికి నాయకత్వం వహించాలని ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా భారతదేశం నిలుస్తుందని లైఫ్ టీచర్, వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆచార్య అజిత్ అన్నారు.విద్యార్థులు మొబైల్ ఫోన్లకు అంకితం ఐతే చదువులో వెనుకబడిపోతారని అన్నారు. శనివారం మదర్ థెరిస్సా అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో దీక్షిత భారత్, అభివృద్ధి చెందుతున్న భారతదేశం అనే అంశాలపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆచార్య అజిత్ మాట్లాడుతూ దేశానికి నాయకత్వం వహించే ఆలోచన విద్యార్థులు,యువకులు చేయాలన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో గణనీయంగా మార్పులు వస్తున్నాయన్నారు. ఆ మార్పులను అందుపుచ్చుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపైనే ఉందన్నారు. పట్టుదల, అంకితభావం ఉన్నవారు అభివృద్ధిలోకి వస్తారన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నారన్నారు. నేటి యువత ఆ లక్ష్యం వైపు ప్రయాణించా లన్నారు. ప్రతి విద్యార్థినీ, విద్యార్థి నాలుగు సంవత్సరాలు ఇంజనీరింగ్ విద్యను క్రమశిక్షణతో చదవాలన్నారు. మంచి కంపెనీలో ఉద్యోగం సాధించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో అనేక దేశాలు వ్యవసాయ, రక్షణ, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా పురోగమిస్తున్నారన్నారు. అభివృద్ధి చెందుతున్న అగ్రదేశాల సరసన భారతదేశ నిలవాలంటే యువత పై ఆ లక్ష్యం ఉంటుందన్నారు. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో యువత భారతదేశంలోనే ఉన్నార న్నారు. భారతదేశ మేధావులకు పుట్టినిల్లు అన్నారు. ప్రపంచం గర్వించదగిన స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం లాంటి వారు భారతీయులన్నారు. నైపుణ్యం కలిగిన విద్యార్థులను తయారు చేయుటకు వైద్య, టెక్నాలజీ రంగాల్లో ప్రభుత్వ ప్రాధాన్యత పెరిగిందన్నారు. పోటీ ప్రపంచంలో నిలబడాలంటే కుత్రిమ మేధను అన్ని రంగాలలో అభివృద్ధి పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒక కళాశాల ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎమ్ వి రామచంద్రరావు, సిఎస్సి విభాగం అధిపతి బి.మరేశ్వరరావు అన్ని విభాగాల అధిపతులు అధ్యాపకులు, విద్యార్థినీ,విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి



**అశ్వారావుపేట టౌన్ అక్టోబర్ 26 నవభూమి:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నటు వంటి సంక్షేమ పథకాల యినా డబల్ బెడ్ రూమ్ ఇల్లు గ్రామపంచాయతీలో పనిచేస్తున్న నిరు పేద కార్మికులకు ఇంటి స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయా లనిగ్రామపంచాయతీలలో పనిచే స్తున్న వితంతువులకు పెన్షన్లు మంజూరు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, అదేవిధంగా మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కోరుతూ సిఐటియు అశ్వరావుపేట మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తాసిల్దార్ కృష్ణ ప్రసాద్ కు మెమోరాండాన్ని ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతేరి 11 నెలలు గడుస్తున్న ఎన్నికల వాగ్దానంలో గ్రామపంచాయతీ కార్మికులకు 18 వేల రూపాయలు వేతనం ఇచ్చే దానికోసం నేటికీ ఎటువంటి ఆలోచన చేయలేదని ప్రస్తుతానికి ఇస్తున్న 8500 వేతనం సరిపోక అవి కూడా నెలనెలా అందకపోవటం వలన మార్కెట్లో పెరిగిన ధరలతో పండుకపోటు కూడా పట్టడం మెతుకుల అనే చందాగా గ్రామపం చాయతీ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమ స్యల పరిష్కరించాలని పలుమార్లు అధికార దృష్టికి తీసుకెళ్లిన కార్మికుల సమస్యలు నేటికీ పరిష్కారం చూపకుండా అక్కడక్కడ ఎమ్మెల్యే లు, ఎంపీలు వస్తున్నారంటూ పని విషయంలో గ్రామపంచాయతీ కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు అర్హులైన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అదేవిధంగా ప్రతి గ్రామపంచాయతీలో కార్మికులకు ఆరు నెలలకు ఒకసారి సబ్బులు బ్లౌజులు, సరుపు, నూనె, షాంపూలు, చీపుర్లు, చెప్పులు, డ్రెస్ కోడు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అశ్వరావుపేట మండల అధ్యక్ష కార్యదర్శులు యాదగిరి వెంకటప్పయ్య కేసుపాక నరసింహారావు, మండల కమిటీ సభ్యులు కట్ట శ్రీను, తగరం రాంబాబు, జొన్నమాల శ్రీకాంత్, వేలేటి నాగభూషణం, కమిటీ సభ్యులు మల్లయ్య, గుర్రాల దుర్గయ్య మాచర్ల రాణి, మాచర్ల మరియమ్మ, అల్లాడి కుమారి, వ్యాస సుదర్శన పుట్టిందిరా, తలారి వెంకటేశ్వరరావు, తగరం యేసు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# సమాజంలో ఆడపిల్లలు దాచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది

- భౌరంపేట చిన్నారిని పరామర్శించిన మంత్రి సీతక్క



**కూకట్‌పల్లి, అక్టోబర్ 26, (నవభూమి ప్రతినిధి) :** సమాజంలో ఆడపిల్లలు దాచుకోవాల్సిన పరిస్థితి నెలకొందని తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. కూకట్ పల్లి రెయిన్ బో ఆసుపత్రి లో భౌరంపేటకు చెందిన చిన్నారిని శనివారం పరామర్శించారు. ఆమె తో పాటు మహిళ కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..చిన్నారిని బిడ్డగా చూసుకోవలసిన దుర్మార్గుడే ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి తండ్రి స్నేహితుడే ఈ ఘటనకు పాల్పడడం బాధను కలిగించిందన్నారు. అన్ని విధాలుగా చిన్నారికి వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కుటుంబానికి అండగా ఉంటామన్నారు. 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సైతం కుటుంబానికి ప్రభుత్వం తరఫున అందించామని తెలిపారు. చిన్నారి కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# ఐటిడిఏ ద్వారా ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే పాయం





**కొత్తగూడెం (భద్రాచలం ) అక్టోబర్ 26 నవభూమి ప్రతినిధి:** గోదావరి వరదల సమయంలో వరద ముంపు ప్రాంతాలైన అశ్వాపురంలోని గొందిగూడెం గ్రామంలో నుండి అశ్వాపురం వస్తుండగా అకస్మాత్తుగా వచ్చిన వరదలలో ఆటో కొట్టుకుపోవడంతో కుటుంబాన్ని పోషించుకోవడం ఇబ్బంది పడుతున్నానని పిఓ దృష్టికి తీసుకురాగా కుటుంబాన్ని పోషించుకోవడానికి 25 వేల రూపాయల ఆర్థిక సహాయం కుటుంబ పోషణ కోసం అందించడం జరిగిందని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు.
శనివారం నాడు ప్రాజెక్టు అధికారి చాంబర్లో సందీప్ ఆటో డ్రైవర్ కు ప్రాజెక్ట్ అధికారి చేతుల మీదుగా 25 వేల రూపాయల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఆటో నడుపుకొని జీవనోపాధి పొందుతున్న సందీప్ ఆటో కొట్టుకుపోవడంతో కుటుంబాన్ని పోషించుకోవడం ఇబ్బంది పడుతున్నానని తన దృష్టికి తీసుకురాగా నేను వెంటనే పి ఓ దృష్టికి తీసుకొని రాగా ఆయన స్పందించి ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుండి జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఆర్థిక సాయం అందించారని, ఆ చెక్కును ఐటీడీఏ పీవో బి. రాహుల్ చేతులమీదుగా సందీప్ ఆటో డ్రైవర్ కు అందించినట్లు ఆయన అన్నారు. అలాగే గొందిగూడెం గ్రామంలోని పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజన రైతులకు అర్హత మేరకు పాయం మల్లమ్మ, కన్నయ్య, గొల్లపల్లి శ్రీనివాస్, సుమలత, కనితిరత్తమ్మ, పాయం వీరనారాయణ, కలబోయిన ముత్తయ్యలకు వారి పంట భూములకు సంబంధించిన పెండింగులో ఉన్న పోడు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి టి ఆర్ ఓ ఎఫ్ ఆర్ లక్ష్మీనారాయణ, ఏడి అగ్రికల్చర్ భాస్కర్ మరియు పట్టాదారులు తదితరులు పాల్గొన్నారు.

# టేకిలా-గోల్డేన్ బ్యారేజ్ పబ్‌ను సీజ్ చేయాలి

**కుత్బుల్లాపూర్,నవభూమి:** టేకీలా - గోల్డెన్ బ్యారెల్ పబ్ ను సిజ్ చేయాలని సైబరాబాద్ కమిషనర్ నిజాంపేట కార్పొరేషన్ లో ఫిర్యాద్ చేయడం జరిగిందని బిజెపి నాయకులు ఆకులు సతీష్ తదితరులు తెలిపారు.

# డిప్యూటీ సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- కలెక్టరేట్ బస్ స్టాప్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, ఫీడింగ్ రూమ్, ఎస్.బి.ఐ. బ్యాంకు, భోజనశాలను ఆదివారం ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం
- డిప్యూటీ సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం,నవభూమి బ్యూరో, అక్టోబర్26:** ఖమ్మం జిల్లా కలెక్టరేట్ కు ఆదివారం ఉదయం పలు ప్రారభోత్సవాలకు డిప్యూటీ సీఎం రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కాగా జరగాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కలెక్టరేట్ లో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న బస్ స్టాప్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, ఫీడింగ్ రూమ్, ఎస్.బి.ఐ. బ్యాంకు, భోజనశాలలను పరిశీలించారు. బస్ స్టాప్ పరిశీలన అనంతరం అక్కడ ఉన్న ప్రజలతో కలెక్టర్ ముచ్చటించారు. జిల్లా కలెక్టరేట్ కు వచ్చిన పని వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్ కు వచ్చే వారి సౌకర్యార్థం కలక్టరేట్ వద్ద బస్ స్టాప్ ఏర్పాటు చేయడం వలన నీడతో పాటు, ఆర్టీసి సేవలు సద్వినియోగం చేసుకొని ప్రశాంతంగా ప్రయాణం చేసి తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. వైరా మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన నాగేశ్వర్ రావు అనే రైతుతో ఏ పంట సాగు చేస్తున్నారు, దిగుబడి ఎంత వస్తుంది, మొదలగు వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ఆయిల్ పామ్ సాగు వల్ల లాభం చేకూరుతుందని, మొదటి 3 సంవత్సరాలు అంతర్ పంటల వల్ల ఆదాయం వస్తుందని, ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. వరదల వల్ల దెబ్బతిన్న పంట పొలాలకు పరిహారం అందిస్తామని అన్నారు. విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రభుత్వ పాఠశాలలను బాగు చేసామని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని, తమతో పాటు తమ చుట్టూ వున్న ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ బడులలో చదివించేలా ప్రోత్సహించాలని తెలిపారు. బీ ఫార్మసీ విద్యార్థి ధీరజ్ తో మాట్లాడి చదువు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుబ్లేడు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు సైదమ్మ దరఖాస్తును కలెక్టర్ పరిశీలించారు. డీఎస్సీ పరీక్షలో ఎంపిక కాలేదని తనకు ఏదైనా పాఠశాలలో టీచర్ ఉద్యోగం ఇప్పించాలని కోరగా, జిల్లా కలెక్టర్ పరిశీలించి అందుబాటులో ఉన్న పాఠశాలలో వాలంటీర్ క్రింద ఎంపిక చేస్తామని, రాబోయే రోజులలో ప్రభుత్వం నిర్వహించే పరీక్షలకు సైతం సిద్ధం కావాలని సూచించారు. వైరా మండలం పాలడుగు గ్రామానికి చెందిన వృద్ధుడు రాజయ్య ఇంటి కొనుగోలు చేసి డబ్బులు చెల్లించలేదని, బెదిరిస్తున్నారని తెలుపగా, వైరా మండల తహసిల్దార్ తో చరవాణిలో కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటి విలువ ఇవ్వలేని పక్షంలో ఇంటిని తిరిగి స్వాధీనం చేసుకొని ఇప్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఆదివారం నాడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నందు పర్యటిస్తారని, కలెక్టరేట్ బస్ స్టాప్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భోజనశాల, ఫీడింగ్ రూమ్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లను ప్రారంభిస్తారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వహణ సంఘాల సభ్యులు అందుబాటులో ఉండాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, డిఆర్డీవో సన్యాసయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.











# అయోడిన్ లోపం వల్ల కలిగే రుగ్మతలపై అవగాహన సదస్సు

**టేకులపల్లి అక్టోబర్ 26 నవభూమి ప్రతినిధి:** అయోడిన్ లోపం వల్ల కలిగే రుగ్మతలపై అవగాహన కల్పించడంలో భాగంగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ శనివారం టేకులపల్లిలోని కేజీబీవీ పాఠశాలలో పిల్లలు, ఉపాధ్యాయ సిబ్బందికి అవగాహన సమావేశం, వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కావాలంటే మానవ శరీరానికి సూక్ష్మ పోషకం అయిన అయోడిన్ ఎంతో ముఖ్యమని, అయోడిన్ లోపం వల్ల ముఖ్యంగా స్త్రీలలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని, గర్భవతుల్లో పాలిచ్చే తల్లులకి ఎక్కువ అయోడిన్ అవసరం ఉంటుందని ఆయన అన్నారు. అయోడిన్ లోపం వల్ల అధిక బరువు, గర్భధారణలో లోపాలు, గర్భస్రావం, నిర్జీవ జననం, పుట్టిన శిశువుకి మెదడు అభివృద్ధిలో లోపాలు తద్వారా పిల్లల్లో వయసుకు తగ్గ ఎదుగుదల లేకపోవడం, జ్ఞాపకశక్తి తగ్గడం, చదువుల్లో, ఆటల్లో ప్రతిభ చూపలేకపోవడం, పుట్టుకతో చెవుడు మూగతనం మరుగుజ్జుతనం, కండరాలు బిగిసుకుకపోవడం, జుట్టు ఊడిపోవడం, కిడ్నీ సమస్యలు, కాలేయ సమస్యలు,



గాయిటర్ వ్యాధి వంటి ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం అయోడిన్ చేర్చిన ఉప్పుని మాత్రమే అమ్మాలని ఆదేశించిందని, అందుకని ఉప్పు ప్యాకెట్ పై అయోడిన్ కలిపినట్లు నిర్ధారించే లోగో ఉన్న ఉప్పు ప్యాకెట్ మాత్రమే కొనుగోలు చేయాలని, దీనితోపాటు సహజంగా అయోడిన్ లభించే ఆహార పదార్థాలైన సముద్రపు చేపలు,



రొయ్యలు, గుడ్లు, పాలు పాల పదార్థాలు, అన్ని రకాల తాజా ఆకుకూరలు, కాయకూరలు తదితర ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా కూడా అయోడిన్ లోపం రాకుండా నివారించుకోవచ్చని తెలిపారు. ఈ